# ధర్నాలతో దద్దరిల్లిన తెలంగాణ

మాయమాటలు, అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపై సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు వెల్లువెత్తాయి. పింఛన్లు పెంపు చేయాలంటూ బీడీకార్మికులు, దివ్యాంగులు ధర్నాలు చేశారు. డీఎస్సీ వాయిదావేయాలని, రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. వీరికి బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ, సీపీఎం, సీఐటీయూ తదితర నాయకులు మద్దతు తెలిపారు.



**వారసత్వ నియామకాలు చేపట్టాలని నిరసన**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 81, 85 ప్రకారం వారసత్వ నియామకాలు చేపట్టాలని వీఆర్ఏలు హనుమకొండ, జనగామ కలెక్టరేట్ల ముందు నిరసన తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు ప్రభుత్వానికి సమర్పించి 11నెలలైందని తెలిపారు. వారసులకు నియామక ఉత్తర్వులు ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్లకు వినతిపత్రం అందజేశారు.



**వేతనాల కోసం పంచాయతీ కార్మికుల ధర్నా**

పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు సోమవారం నిజామాబాద్ జిల్లా నవీపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వేతనాలు చెల్లించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపీడీవో నాగనాథ్‌కు అందజేశారు.

## జీతాలో రాజనర్సింహ!

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 8 (నమస్తే తెలంగాణ): 'మూడు నెలలుగా జీతాలు లేవు....ఇంటి అద్దె కట్టకపోవడంతో ఓనర్స్ ఇళ్లు ఖాళీ చేయమంటున్నారు. పిల్లల స్కూళ్లు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నది.. స్కూల్ ఫీజులు కట్టకపోవడంతో యాజమాన్యాలు పిల్లలను నిలదీస్తున్నాయి. కండ్లముందే పిల్లలు పస్తులుండటం చూడలేక అప్పులు చేసి, ఆత్మహత్య చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఉద్యోగాల్లో చేరితే చివరకు మా కుటుంబాలకు దిక్కు లేకుండా పోయింది' అంటూ కన్నీరు పెడుతున్నారు టిమ్స్ కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది. గచ్చిబౌలిలోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)లో ప్రస్తుతం 180 మంది సేవలందిస్తున్నారు. జీతాలు ఇవ్వాలని మంత్రి రాజనర్సింహకు మొరపెట్టుకున్నారు. ఏప్రిల్ నుంచి జీతాలు రాలేదన్నారు.

## కేసీఆర్ సారున్నప్పుడే మంచిగుండె..

**కాంగ్రెసోళ్లు మాయ మాటలు చెప్పి మోసగించిండ్రు: ఓ మహిళ ఆవేదన**



ఖలీల్‌వాడి, జూలై 8: కేసీఆర్ సార్ ఉన్నప్పుడే మంచిగుండె. ఐదో తారీఖు కల్లా పింఛన్లు అచ్చేటివి. ఇప్పుడు అట్ల అత్తలేవు. కాంగ్రెసోళ్ల మాయ మాటలకు మోసపోయి ఓట్లేసి గెలిపిస్తే ఏం సక్కగున్నదని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పిప్రికి చెందిన సునీత విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీడీ కార్మికుల ధర్నాకు వచ్చిన ఆమెను విలేకరులు పలుకరించగా తన ఆవేదనను వెలిబుచ్చారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయామన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి మహిళలను మోసం చేసిండు' అని అన్నారు. ఫ్రీ బస్ కావాలని ఎవరన్న అడిగిండ్రా..? బస్సులో భర్తలు నిలబడితే భార్యలు కూర్చోవాల్నా? అని వ్యాఖ్యానించారు. ఫ్రీ కరెంట్ వచ్చినోళ్లు సంతోషపడుతున్నారు. రానివాళ్లు కన్నీళ్లు పెడుతున్నారని చెప్పారు. రూ.4 వేల పింఛన్ ఇప్పుడెస్తారో చెప్పాలని నిలదీశారు.

## • పింఛన్ పెంచాలని బీడీ కార్మికుల ఆందోళన



కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం జీవనభృతిని 4 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బీడీ కార్మికులు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉన్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను ఆదుకోవాలని కోరారు. *-ఖలీల్‌వాడి, జూలై 8*

## • హెల్త్ సబ్ సెంటర్‌కు తాళం వేసిన గ్రామస్థులు



హెల్త్ సబ్‌సెంటర్‌లో వైద్య సేవలందించడం లేదని సోమవారం మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కోనంపేటలోని హెల్త్ సబ్ సెంటర్‌కు గ్రామస్థులు తాళం వేసి నిరసన తెలిపారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక, సరైన బోధన అందక విద్యార్థులు ఇతర పాఠశాలల వెళ్తున్నారని తెలిపారు. రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి కాలేదని, గ్రామానికి సరైన రోడ్డు లేక ఇబ్బందిపడుతున్నామని తెలిపారు. అధికారులకు సమస్యలపై విన్నవించినా పట్టించుకోకపోవడంతో సబ్ సెంటర్‌కు తాళం వేశామని గ్రామస్థుడు రాంటెంకి శ్రీనివాస్ తెలిపారు. *-నెన్నెల, జూలై 8:*





## గుడిసెలకు పట్టాలివ్వాలని ధర్నా

ములుగు రూరల్, జూలై 8: తాము వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించాలని, భూస్వాముల దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ ములుగు కలెక్టరేట్ ఎదుట గుడిసెవాసులు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గోవిందరావుపేట మండలం పస్రానాగారం రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 109/ఈ/1లోని పదెకరాల భూమిలో రెండేళ్ల క్రితం పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. ఈ భూమిని ఆక్రమించుకోవడం కోసం 60 ఏళ్లుగా ఇద్దరు భూస్వాములు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, మంత్రి సీతక్క జోక్యం చేసుకొని పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ దివాకరను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, రత్నం రాజేందర్, తీగల ఆదిరెడ్డి, గఫూర్‌బాషా, రాకేశ్, రత్నం ప్రవీణ్, మల్లారెడ్డి, మురళి, ఉపేంద్ర, రమేశ్, బ్రహ్మాచారి, రాజు, రజిత, కవిత, రాజేశ్వరి, శారద, సువర్ణ పాల్గొన్నారు.

## • పింఛన్ రాలేదని పెట్రోల్‌తో ప్రజావాణికి దివ్యాంగుడు



జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం అలీంపూర్‌కు చెందిన పాకాల రమేశ్ 2021లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కాలు కోల్పోవడంతో సదరంలో 85 శాతం వైకల్యం ఉన్నట్లు మెడికల్ బోర్డు 2022లో సర్టిఫికెట్ ఇచ్చింది. తనకు దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని ఏడాదిగా అర్జీ పెట్టుకున్నాడు. సోమవారం జనగామ కలెక్టరేట్‌లో ప్రజావాణికి పెట్రోల్ బాటిల్ పెట్టుకొని రమేశ్ రాగా, గమనించిన సిబ్బంది లాక్కొని కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. 2022 నుంచి కొత్త పింఛన్లు మంజూరుకాలేదని, ఆదేశాలు వచ్చే వరకు ఆగాలని సముదాయించినా వినకపోవడంతో సఖి సెంటర్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇప్పించాలని కలెక్టర్ ఆదేశించారు. *-జనగామ, జూలై 8*





డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు, పీడీఎస్‌యూ నాయకులు



రైతు దంపతులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసు అధికారులు

## పురుగుల మందు డబ్బాతో ప్రజావాణికి

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 8: అధికారుల నిర్లక్ష్యంతో తనకున్న రెండెకరాల భూమి ధరణిలో నమోదు కాకపోగా, ఇదేంటని అడిగితే ఉల్టా బెదిరిస్తున్న అధికారుల తీరుతో విసుగు చెందిన ఓ పేద రైతు జంట పురుగుల మందు డబ్బాతో ప్రజావాణికి వచ్చింది. తన భూమిని ఇతరులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని, దానిని పరిశీలించి తన పేర నమోదు చేయాలని కరీంనగర్ జిల్లా గంగాధర మండలం సర్వారెడ్డిపల్లికి చెందిన ఒగ్గు రాజమల్లు కొద్దికాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ప్రశ్నిస్తే ఉల్టా కేసులు నమోదుచేయిస్తామంటూ బెదిరించడంతో రాజమల్లు, తన భార్యతో కలిసి పురుగుల మందు డబ్బాతో కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చాడు. పోలీసులు తనిఖీ చేస్తుండగా, సంచిలో పురుగుల మందు డబ్బా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. అధికారులు తమ భూమిని ఇతరుల పేర్లపై ధరణిలో నమోదు చేసిన వివరాలు వెల్లడించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించకుంటే ప్రజావాణిలోనే పురుగుల మందు తాగుదామని నిర్ణయించుకుని వెంట తెచ్చుకున్నట్టు వెల్లడించారు. పురుగుల మందు డబ్బా స్వాధీనం చేసుకుని, కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు అధికారులకు ఫిర్యాదు చేయించారు.



## కోనేరు పూడ్చివేతను నిరసిస్తూ జడ్చర్ల బంద్

జడ్చర్ల/జడ్చర్లటౌన్, జూలై 8: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలోని బాదేపల్లి పెద్దగుట్టపై ఉన్న రంగనాయకస్వామి ఆలయం ఎదుట ఉన్న కోనేరు పూడ్చివేతను నిరసిస్తూ సోమవారం చేపట్టిన 'జడ్చర్ల బంద్' విజయవంతమైంది. బాదేపల్లి పాతబజార్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణ ప్రధాన రహదారులపై ధార్మిక సంఘాలు, ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు, యువకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నేతాజీ కూడలిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపి కోనేరు పూడ్చివేతకు పాల్పడ్డారని ఆరోపించారు. వారిని అదుపులోకి తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. కోనేరు పూడ్చడం, ఇతర కట్టడాలను కూల్చివేయడం బాధాకరమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

## డీఎస్సీ పరీక్ష గడువు పెంచాలి

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 8: తమ జీవితాలతో చెలగాటం ఆడొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్ష కోసం గడువు పెంచాలని కోరారు. ఖమ్మం జిల్లా గ్రంథాలయం ఎదుట నిరుద్యోగులు, పీడీఎస్‌యూ నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టల్ వెల్ఫేర్ పరీక్షకు, డీఎస్సీకి మధ్యలో 15 రోజులు మాత్రమే గడువు ఉందని అన్నారు. ఈ క్రమంలో డీఎస్సీకి ప్రిపేర్ అయ్యే అవకాశం ఉండడం లేదని చెప్పారు. డీఎస్సీ అభ్యర్థులకు 45 రోజులు గడువు పెంచాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు, నిరుద్యోగులు ఆజాద్, ప్రేమ్ సింగ్, వెంకటేశ్, రమేశ్, కొండల్‌రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరుద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను విస్మరించారని ధ్వజమెత్తారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలని, గురుకులాల్లో ఖాళీగా ఉన్న 2 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. *-కల్వకుర్తి, జూలై 8:*





## ఆటో డ్రైవర్ల హామీలను అమలు చేయాలని ధర్నా

హిమాయత్‌నగర్, జూలై 8: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు దాటినా ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కంచలేదని ఆరోపించారు. 50 ఏండ్లు నిండిన ఆటో డ్రైవర్లకు పింఛన్లు ఇవ్వడంతో పాటు యాక్సిడెంటల్ బీమా రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి కమతం యాదగిరి, యూనియన్ నేతలు జంగయ్య, కొమురెల్లి బాబు, ఒమర్ ఖాన్, లతీఫ్, భిక్షపతి, నర్సిరెడ్డి, అశోక్, భాస్కర్, రవి, దావూద్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు 6 వేల పింఛన్ ఇవ్వాలి

• **దివ్యాంగుల సమైక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్**

చిక్కడపల్లి, జూలై 8: దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు రూ.6 వేల పెన్షన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ దివ్యాంగుల సమైక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల హక్కుల చట్టం -2016ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉచిత బస్సు సౌకర్యం కలిపించాలని డిమాండ్ చేశారు. ధర్నాంలో సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యుడు భిక్షపతి , ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాస్, శిరీష, రషీద్, ప్రవీణ్‌కుమార్, ఊర్మిళ, విజయ్‌కుమార్, రాజేశ్వరి, గీత, ఉమారాణి పాల్గొన్నారు.

## • హామీల అమలుకు అంగన్‌వాడీల ఆందోళన





రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సహా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఉద్యోగ విరమణ, పెన్షన్ సదుపాయం తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఉద్యోగులను వంచించే విధంగా ఉందని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు మండిపడ్డారు. ప్రభుత్వం జీవో నంబర్ 10ని వెనక్కు తీసుకుని కొత్త జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. *-ఖలీల్‌వాడి, జూలై 8*



కలెక్టరేట్ ఎదుట కుటుంబసభ్యులతో నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి శోభన్

## విధుల నుంచి తొలగించారని అటెండర్ నిరసన

మహబూబాబాద్ రూరల్, జూలై 8: తనను కావాలనే విధుల్లో నుంచి తొలగించారని పశుసంవర్ధక శాఖలో ఔట్ సోర్సింగ్ అటెండర్‌గా పనిచేసిన సలుగు శోభన్ సోమవారం కుటుంబసభ్యులతో కలిసి మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొమ్ములవంచకు చెందిన తాను 2006 నుంచి నెల్లికుదురు మండల పశుసంవర్ధక కార్యాలయంలో అటెండర్‌గా పనిచేశానని చెప్పారు. 2020లో లోకల్, నాన్ లోకల్ క్యాటగిరీ చూపి ఉద్యోగం నుంచి తొలగించారని, మళ్లీ రెండు నెలలకే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మాత్రం మూడేళ్లుగా డెయిరీ డిప్లొమా కోర్స్ చదివి ఉండాలని సాకు చూపుతూ విధుల్లోకి తీసుకోవడం లేదని ఆవేదన వెలిబుచ్చారు.